సాక్షి
పార్వతీపురం మన్యం
మంగళవారం। 5। ఆగస్టు। 2025



క్రీడాకారులతో ఆటలు..!

జిల్లా క్రికెట్‌లో ఉమ్మడి విజయనగరం జిల్లా క్రీడాకారుల ప్రాతినిధ్యం తగ్గిపోతోంది.

- 8లో



అర్జీల పరిష్కారానికి శ్రద్ధ తీసుకోవాలి

- 8లో

పీజీఆర్ఎస్‌కు వచ్చే అర్జీల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ చూపాలని అధికారులను కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ఆదేశించారు.

సబ్ కలెక్టర్లుగా స్వప్నిల్ జగన్నాథ్, వైశాలి

సాక్షి, పార్వతీపురం మన్యం: పార్వతీపురం, పాలకొండ డివిజన్లకు 2023 బ్యాచ్‌కు చెందిన ప్రొబేషనరీ ఐఏఎస్‌లను సబ్ కలెక్టర్లుగా నియమిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. పార్వతీపురం సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీ వాత్సవను బదిలీ చేసింది. ఆ స్థానంలో ఆర్.వైశాలి నియమితులయ్యారు. పాలకొండ సబ్ కలెక్టర్ యశ్వంత్‌కుమార్ రెడ్డిని బదిలీ చేస్తూ.. ఆ స్థానంలో పవర్ స్వప్నిల్ జగన్నాథ్‌ను నియమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి.

న్యూస్‌రీల్

ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తాం

సీతంపేట: ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఈ నెల 9న ఘనంగా నిర్వహించనున్నట్టు ఐటీడీఏ పీఓ సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సీతంపేట ఐటీడీఏ పరిధిలో సీతంపేట, భామిని, వీరఘట్టం, పాలకొండ మండలాల ప్రజలతో సీతంపేట అడ్వంచర్ పార్కులో ఉదయం 10 గంటలకు, శ్రీకాకుళం జిల్లాకు చెందిన 16 మండలాలకు పాతపట్నం మార్కెట్ యార్డు ఆవరణలో అదే రోజు మధ్యాహ్నం 2 గంటలకు ఆదివాసీ దినోత్సవం నిర్వహిస్తామని పేర్కొన్నారు.

సాగునీటి కోసం రైతుల ఆందోళన



డీఈఈకి వినతి పత్రం అందజేస్తున్న రైతులు

పాలకొండ: ఖరీఫ్ సీజన్‌లో వరి ఉభాలు ఆరభమైనా తోటపల్లి ఎడమ కాలువ నుంచి ఆయకట్టుకు సాగునీరు అందడంలేదంటూ రైతులు సోమవారం ఆందోళన చేపట్టారు. జలవనరుల శాఖ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బంటు దాసు, రైతులు కండాపు ప్రసాదరావు, వారాడ సుమంత్‌నాయుడు మాట్లాడుతూ ఈ ఏడాది ఖరీఫ్‌లో ఇంతవరకు సాగునీరు అందకపోయినా ప్రభుత్వం స్పందించడంలేదన్నారు. జూన్ 4వ తేదీన రైతులతో జాయింట్ సమావేశం ఏర్పాటు చేసి షట్టర్లు బాగుచేస్తామని హామీ ఇచ్చి ఇంతవరకు చేపట్టలేదని వాపోయారు. వర్షాభావంతో వరి నాట్లు ఎండిపోతున్నాయని, వెంటనే సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. సాగునీరు అందించకుంటే క్రాప్ హాలీడే ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఎస్సై ప్రయోగమూర్తి రైతులకు సర్దిచెప్పి ఆందోళన విరమింపజేశారు. అనంతరం రైతులు జలవనరుల శాఖ అధికారులకు వినతి పత్రం అందజేశారు. దీనిపై డీఈఈ స్పందిస్తూ రెండు రోజుల్లో పాలకొండలోని భూములకు సాగునీరు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో దావాల రమణారావు, ఆయకట్టు రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఎరువుల కోసం నిరసన



కురుకూటిలో ఎరువుల కోసం గిరిజన రైతుల ఆందోళన

సాలూరు: ఖరీఫ్ సీజన్‌లో సాగుచేసిన పంటలకు వేసేందుకు యూరియా దొరకడం లేదు.. బయట మార్కెట్‌లో అధిక ధరలకు విక్రయిస్తున్నారు.. ఎరువును ఎప్పుడు పంపిణీ చేస్తారో చెప్పాలంటూ కురుకుట్టి రైతుభరోసా కేంద్రం వద్ద సోమవారం గిరిజన రైతులు పెద్ద ఎత్తున ఆందోళన చేశారు. కురుకుట్టి పంచాయతీ పరిధిలోని పుల్లమామిడి, బట్టివలస, దళాయివలస, పుల్లేలవలస, తాడివలస, నందేడవలస తదితర 18 గ్రామాల నుంచి సుమారు 400 మంది ఆందోళనలో పాల్గొన్నారు. కూటమి ప్రభుత్వ తీరును దుమ్మెత్తిపోయారు. ఎరువులు అందించలేని ప్రభుత్వ నిస్సహాయతను ఎండగట్టారు. తక్షణమే ఎరువులు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.

12న డీవార్మింగ్ డే

- కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్



జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, అధికారులు

పార్వతీపురం రూరల్: జిల్లాలో ఈనెల 12న నిర్వహించనున్న డీ వార్మింగ్ డేను విజయవంతం చేయాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ వైద్యాధికారులను ఆదేశించారు. విద్యార్థులకు అందించే ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీకి ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. ఈ మేరకు కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ భాస్కరరావు మాట్లాడుతూ జిల్లాలో ఉన్న 1,96,612 మంది బాలబాలికలకు ఆల్బెండజోల్ మాత్రలు అందజేస్తామన్నారు. వీటిని భోజనం అనంతరం మాత్రమే మింగించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సేవల ధరల పట్టిక పెట్టాలి

విజయనగరం ఫోర్ట్: జిల్లాలో ఉన్న ప్రైవేటు ఆస్పత్రులు, నర్సింగ్ హోమ్స్, క్లినిక్స్, ల్యాబ్స్, స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులందరూ విధిగా వివిధ సేవల ధరల పట్టికను పెట్టాలని డీఎంహెచ్ఓ డాక్టర్ ఎస్.జీవనరాణి ఆదేశించారు. ప్రతీ ఆస్పత్రికి ఫైర్ ఎన్ఓసీ తప్పనిసరన్నారు.

దళారులకే ఎరువులు

- రైతాంగానికి యూరియా అందించడంలో ప్రభుత్వం విఫలం
- ఎరువుల కృత్రిమ కొరతపై చర్యలు తీసుకోవాలి
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పరీక్షిత్ రాజు, మాజీ ఉప ముఖ్యమంత్రి పుష్ప శ్రీవాణి, మాజీ ఎమ్మెల్యే జోగారావు
- పీజీఆర్ఎస్‌లో అధికారులకు వినతి

సాక్షి, పార్వతీపురం మన్యం:

జిల్లాలో నిజమైన రైతుకు యూరియా, ఇతర కాంప్లెక్స్ ఎరువులు అందడం లేదని.. కూటమి నాయకులు, కార్యకర్తలే దళారుల అవతారం ఎత్తి వాటిని బ్లాక్ మార్కెట్‌కు తరలించి కృత్రిమ కొరత సృష్టించి, అధిక ధరకు విక్రయిస్తున్నారని వైఎస్సార్ సీపీ నాయకులు తెలిపారు. ఎరువులు అందక, బహిరంగ మార్కెట్‌లో ఎక్కువ ధరలు వెచ్చించి కొనుగోలు చేయలేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కొరతను నివారించి అన్నదాతలను ఆదుకోవాలని కోరారు. ఎరువుల సమస్య పరిష్కరించాలని కోరుతూ మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పిలుపు మేరకు జిల్లా పార్టీ ఆధ్వర్యంలో నాయకులు సోమవారం కలెక్టరేట్ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో డీఆర్వో హేమలతకు వినతిపత్రం అందజేశారు. రైతాంగం ఎదుర్కొంటున్న ఇబ్బందులను పార్టీ జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు, మాజీ ఉప ముఖ్యమంత్రి, కురుపాం నియోజకవర్గ ఇన్‌చార్జి పాముల పుష్పశ్రీవాణి, పార్వతీపురం మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జి అలజంగి జోగారావు వివరించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు.

రైతులను దగా చేస్తున్న కూటమి ప్రభుత్వం



దేశంలో ఎక్కడా లేనివిధంగా ఒక్క ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే రైతన్నలకు పార్టీ రంగు అంటగట్టి, అరకొర ఎరువులను అందించి కూటమి ప్రభుత్వం దగా చేస్తోంది. జిల్లా వ్యాప్తంగా ఎరువుల కొరత తీవ్రంగా వేధిస్తోంది. గతంలో ఎన్నడూ లేని పరిస్థితిని నేడు రైతులు ఎదుర్కొంటున్నారు. చివరికి ఎరువులను కూడా కూటమి ప్రభుత్వం వారు వదలడం లేదు. వారి నిర్వాకం వల్లే కృత్రిమ కొరత. పార్టీ జెండాలు, పార్టీ రంగులు చూసి ఇవ్వడం దురదృష్టకరం. కూటమి సిగ్గుమాలిన పాలనకు ఇంతకంటే నిదర్శనం ఇంకేం ఉంటుంది? ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరవాలి. దళారీ వ్యవస్థను అరికట్టి, రైతులకు అవసరమైన ఎరువులను అందించాలి.

– అలజంగి జోగారావు, మాజీ ఎమ్మెల్యే, పార్వతీపురం నియోజకవర్గ ఇన్‌చార్జి



కలెక్టరేట్ వద్ద వైఎస్సార్‌సీపీ నాయకులు



జిల్లా రెవెన్యూ అధికారిణికి వినతిపత్రం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

ఎరువుల సరఫరాలో ప్రభుత్వం విఫలం



ఆకుమడుల సమయంలో యూరియా సరఫరా చేయడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. రైతుకు ఎరువులు, విత్తనాలు కూడా అందించలేని స్థితిలో యంత్రాంగం ఉంది. దళారులు కృత్రిమ కొరత సృష్టించారు. నల్లబజారుకు తరలించారు. రైతుకు గత్యంతరం లేక అధిక ధరకు వ్యాపారుల వద్ద కొనుగోలు చేస్తున్నారు. యూరియా అంతా ఇచ్చేశామని జిల్లా అధికారులు చెబుతున్నారు. క్షేత్రస్థాయిలో వాస్తవాన్ని ఒకసారి పరిశీలించాలి. ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు.. రైతులందరికీ ఆయన ద్వారా భరోసా ఉండదని స్వయంగా ఒప్పుకున్నారు. అది నిజం చేస్తున్నారు. ఆయన దారిలోనే అధికారులు కూడా వెళ్తున్నట్లు ఉంది. నేడు దారుణమైన పరిస్థితిలో రైతులు ఉన్నారు. ఎరువులు, యూరియా కొరత నివారించి, వారిని ఆదుకోవాలి.

– శత్రుచర్ల పరీక్షిత్‌రాజు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు

కూటమి నేతలు దౌర్జన్యంగా తరలించుకుపోతున్నారు..



వైఎస్సార్‌సీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రైతుల పక్షాన జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందించాం. రైతులకు భరోసాగా ఉండాల్సిన ప్రభుత్వమే.. నేడు వారిని ఇబ్బంది పెడుతోంది. వ్యవసాయ పనుల కీలక సమయంలో యూరియా, డీఏపీ ఎరువును జిల్లా యంత్రాంగం అందించలేకపోయింది. కురుపాం నియోజకవర్గం పరిధిలోని పెద్దూరు సచివాలయం పరిధిలో 3 వేలు ఎకరాలు ఉంటే.. కేవలం 450 బస్తాలే ఇచ్చారు. ఇది సరిపోతుందా? ఏ పంచాయతీకి వెళ్లినా, ఏ గ్రామానికి వెళ్లినా ఇదే పరిస్థితి ఉంది. ప్రభుత్వం అందించకపోవడం వల్ల నల్లబజారులో రూ.550 నుంచి రూ.600 వరకు కొనుగోలు చేస్తున్నారు. కొరత లేదని జిల్లా కలెక్టర్ ఏ విధంగా ప్రకటన ఇస్తారు? రైతుకు భరోసా ఇవ్వడమంటే విత్తనం దగ్గర నుంచి ఎరువులు, పచ్చరొట్ట విత్తనాలు, వ్యవసాయ యంత్రాలు, ట్రాక్టర్లు సబ్సిడీపై గతం ప్రభుత్వంలో అందించడం. నేడు ఏమిచ్చారు? సచివాలయానికి 200 బస్తాలిస్తే.. కూటమి నేతలు ట్రాక్టర్లు తెచ్చి, 50 బస్తాల వరకు దౌర్జన్యంగా తీసుకెళ్తున్న పరిస్థితి ఉంది.

– పాముల పుష్పశ్రీవాణి, మాజీ ఉపముఖ్యమంత్రి, కురుపాం నియోజకవర్గ ఇన్‌చార్జి

- బైక్‌ను వెనుక నుంచి ఢీకొట్టిన లారీ
- గాలిలో కలిసిన ముగ్గురు యువకుల ప్రాణాలు
- కొరిశీల గ్రామంలో విషాదం
- మృతుల్లో ఇద్దరు అన్నదమ్ములు
- కన్నీరు మున్నీరు అవుతున్న కుటుంబ సభ్యులు

దూసుకొచ్చిన మృత్యువు

లారీ ఢీకొనడంతో మృతి చెందిన కొరిశీల యువకులు



సిగురు ఉదయ్‌కిరణ్, సిగురు కార్తీక్, దువ్వాన జగన్ (ఫైల్)

కొమరాడ: ఓ ఐదు నిమిషాల్లో వారి ప్రయాణం సుఖవంతమయ్యేది. ఇంతలో లారీ రూపంలో మృత్యువు దూసుకొచ్చింది. వెనుక నుంచి వారు వెళ్తున్న స్కూటీని బలంగా ఢీకొట్టింది. అంతే.. ముగ్గురు యువకుల ప్రాణాలు క్షణాల్లో గాలిలో కలిసిపోయాయి. ఈ హృదయవిదారక ఘటనకు సంబంధించి పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... కొమరాడ మండలం గుణదతీలేస్ పంచాయతీ కొరిశీల గ్రామానికి చెందిన సిగురు కార్తీక్ (21), సిగురు ఉదయ్ కిరణ్ (19) అన్నదమ్ములు. వీరి తల్లి మృతిచెందింది. తండ్రి పురుపాలు ఉన్నారు. భవన నిర్మాణ కార్మికుడిగా ఒడిశాకు వలసవెళ్లి పనిచేస్తున్నాడు. కార్తీక్ ఐటీఐ పూర్తిచేసి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు కంపెనీల్లో ఉద్యోగం చేస్తున్నాడు. తమ్ముడిని చూసేందుకు ఇటీవల గ్రామానికి వచ్చాడు. చక్కగా చదువుకోవాలంటూ డిగ్రీ చదువుతున్న ఉదయ్‌కిరణ్‌కు హితబోధ చేశాడు. తిరిగి హైదరాబాద్ వెళ్లే క్రమంలో గుమ్మ రైల్వేస్టేషన్‌కు తమ్ముడితో పాటు ఇంటర్ చదువుతున్న గ్రామానికి చెందిన దువ్వాన జగన్ (17)తో కలిసి సోమవారం సాయంత్రం బయలుదేరాడు. మరో ఐదు నిమిషాల్లో స్టేషన్‌కు చేరుకుంటారన్న సమయంలో కేజీబీవీ సమీపంలోని మలుపు వద్ద ఒడిశాకు చెందిన లారీ వెనుకనుంచి ఢీకొంది. అంతే.. చెల్లాచెదురుగా పడిపోయారు. వారి కాళ్లు పూర్తిగా విరిగిపోయాయి. రోడ్డంతా రక్తంతో తడిసిపోయింది. వివిధ అవయవాలు నుజ్జయ్యాయి. ఈ ఘటనను చూసిన వారు కన్నీరుపెట్టారు. అయ్యో.. చిన్నవయస్సులోనే మృత్యువు కాటేసిందంటూ రోదించారు. కుటుంబాలను ఆదుకుంటారనుకున్న యువకుల ప్రయాణం అర్ధాంతరంగా ముగి యడంతో గ్రామంలో విషాదం అలముకుంది.

అర్జీదారులకు రుచికర భోజనం

- కలెక్టరేట్ పీజీఆర్ఎస్‌కు వచ్చే ప్రజల కోసం ఉచితంగా ఏర్పాటు
- దాతల సహకారంతో నిర్వహణ: కలెక్టర్



అర్జీదారులకు అన్నం వడ్డిస్తున్న కలెక్టర్, పీవో, డీఆర్వో

పార్వతీపురం రూరల్: ప్రతి సోమవారం జిల్లా నలుమూలల నుంచి తమ సమస్యల పరిష్కారం కోరుతూ వందలాది మంది అర్జీదారులు కలెక్టరేట్‌కు వస్తుంటారు. ఉన్నతాధికారులను తమ గోడు వినిపించి, వినతిపత్రాలు అందిస్తారు. ఏజెన్సీ ప్రాంతం కావడంతో కొండకోనలు, మారుమూల పల్లెల నుంచి వేకువ జామునే బయల్దేరి, వందలాది కిలోమీటర్లు ప్రయాణించి జిల్లా కేంద్రానికి చేరుకుంటారు. తిరిగి చీకటిపడ్డాకే ఊళ్లకు చేరేది. రాకపోకలకు ప్రయాణ ఖర్చులే కాక.. భోజనానికీ ఒక్కోసారి ఇబ్బందులు పడుతుంటారు. బయట హోటళ్లలో తినాలంటే ఒక్కొక్కరికీ రూ.60 నుంచి రూ.100 వరకు ఖర్చు పెట్టాల్సిందే. అంత వ్యయం పెట్టుకోలేక ఆకలితోనే ఎంతోమంది తిరుగు ప్రయాణమవుతుంటారు. ఇటువంటి వారి ఇబ్బందులను గుర్తించిన కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్.. దూర ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారులకు రుచి, శుచికర ఆహారాన్ని ఉచితంగానే అందించాలని నిర్ణయించారు. కలెక్టరేట్ ఆవరణలో సోమవారం ఉచిత భోజనం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఐటీడీఏ పీవో అశుతోష్ శ్రీవత్సవ, జిల్లా రెవెన్యూ అధికారిణి హేమలలతో కలిసి కాసేపు అర్జీదారులకు భోజనం వడ్డించారు.

పేదల ఆకలి తీర్చాలనే..

ప్రతి సోమవారం కలెక్టరేట్‌కు దూర ప్రాంతాల నుంచి ఎంతోమంది పేదలు వినతి పత్రాలు ఇవ్వడానికి వస్తుంటారు. ఆకలితోనే తిరుగు ప్రయాణమై, ఏ రాత్రికో ఇంటికి చేరుకుంటారు. అటువంటి వారికోసమే ప్రత్యేకంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నాం. ఇక మీదట అర్జీదారులు ఉచితంగానే ఇక్కడ భోజనం చేసి వెళ్లొచ్చు. ప్రతి వారం సుమారు 500 మంది వరకూ తిని, వెళ్లేలా ఏర్పాట్లు చేస్తున్నాం. ఇందుకోసం దాతలు ముందుకు రావాలి. ఎవరైనా వారికి తోచిన రీతిలో సహాయం అందిస్తే అన్నదాన కార్యక్రమానికి తోడ్పడినవారవుతారు.

– ఎ.శ్యామ్‌ప్రసాద్, కలెక్టర్

కలెక్టర్ వద్దకు మున్సిపల్ పంచాయితీ!

- కమిషనర్ వర్సెస్ ఉద్యోగులు
- చోద్యం చూస్తున్న 'పెద్దన్న'లు
- రోజురోజుకూ జఠిలమవుతున్న వివాదం

సాక్షి, పార్వతీపురం మన్యం:

పార్వతీపురం పురపాలక సంఘంలో కమిషనర్ వెంకటేశ్వర్లు, ఉద్యోగుల మధ్య వివాదం రోజురోజుకూ జఠిలమవుతోంది. ఇప్పటికే పలు దఫాలు ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. కమిషనర్ తీరును ఎండగట్టారు. ఇటీవల స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయ్‌చంద్రను కలిసి వినతిపత్రం అందజేశారు. కమిషనర్ వెంకటేశ్వర్లు తమను ఏవిధంగా ఇబ్బంది పెడుతున్నదీ వివరించారు. ప్రతి పనికీ రేటు కట్టేసి.. ప్రజల నుంచే కాక, స్వయంగా సిబ్బంది వద్ద కూడా వసూలు చేస్తున్నట్లు తెలిపారు. వచ్చిన మొత్తంలో ఎమ్మెల్యేకు, ఉన్నతాధికారులకు ఇవ్వాలని బహిరంగంగానే కమిషనర్ చెబుతున్నట్లు సాక్షాత్తు శాసనసభ్యులు విజయ్‌చంద్ర వద్దే ప్రస్తావించారు. కొన్ని నెలలుగా కమిషనర్ వెంకటేశ్వర్లు తీరుతో ఎంతోమంది విసుగు చెందుతున్నా.. సయోధ్యకు ఏ ఒక్కరూ ప్రయత్నించకపోవడం గమనార్హం.

పాలకవర్గానికీ కమిషనర్ తీరుతో ఇబ్బందులు

పార్వతీపురం పురపాలక సంఘం కమిషనర్ వెంకటేశ్వర్లు తరచూ వివాదాస్పదంగా వ్యవహరిస్తున్నారు. మున్సిపల్ పాలకవర్గాన్నీ లెక్క చేయక, ప్రోటోకాల్ పాటించక పక్కా టీడీపీ కార్యకర్త మాదిరి పని చేస్తున్నారన్న ఆరోపణలు ఎప్పటి నుంచో వినిపిస్తున్నాయి. ప్రధానంగా వైఎస్సార్‌సీపీ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్లు, సభ్యులే లక్ష్యంగా.. వారికి వ్యతిరేకంగా నిర్ణయాలు తీసుకుంటున్నారు. దీనిపై పాలకవర్గ సభ్యులు ఉన్నతాధికారులకూ ఫిర్యాదు చేశారు. కొద్దిరోజులు ఆ శాఖ ఆర్డీ కూడా విచారణ జరిపారు. ఆ సమయంలోనూ వివిధ వర్గాల నుంచి కమిషనర్‌కు వ్యతిరేకంగా ఫిర్యాదులు వెళ్లాయి.

నలిగిపోతున్న ఉద్యోగులు

మరోవైపు కమిషనర్ తీరుతో కార్యాలయ ఉద్యోగులూ నలిగిపోతున్నారు. కార్యాలయం దగ్గర పలుమార్లు ఆందోళన చేశారు. పెన్‌డౌన్ చేపట్టారు. చైర్‌పర్సన్ గౌరీశ్వరికి ఫిర్యాదు చేశారు. స్థానిక ఎమ్మెల్యేకు మొర పెట్టుకున్నారు. చివరికి సోమవారం పీజీఆర్ఎస్‌లో కలెక్టర్‌ను కలసి వినతిపత్రం అందజేశారు. కమిషనర్ అవినీతిని, తమ పట్ల ఆయన వైఖరిని ఎండగట్టారు.



కమిషనర్ తీరుపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న ఉద్యోగులు

కమిషనర్‌కు ఎమ్మెల్యే అండ?

మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లుకు స్థానిక ఎమ్మెల్యే అండ పుష్కలంగా ఉందన్న విమర్శలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. ఎమ్మెల్యే ప్రోద్బలంతోనే ఆయనను ఇక్కడ నియమించారని చెబుతుంటారు. అందువల్లే ఎవరెన్ని ఫిర్యాదులు చేస్తున్నా ఆయనపై చర్యలు తీసుకోవడంలో మీనమేషాలు లెక్కిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. కనీసం ఇరువర్గాల మధ్య సయోధ్యకు కూడా ప్రయత్నించకపోవడం గమనార్హం. ఈ ప్రభావం మున్సిపాలిటీ అభివృద్ధి మీద పడుతున్నా.. వ్యక్తిగత ప్రయోజనాలే ముఖ్యంగా వ్యవహరిస్తుండటంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈసారి కలెక్టర్ అయినా జోక్యం చేసుకుని, దీనికి పరిష్కారం చూపుతారో, లేదో చూడాలి.

ఆందోళన.. ఆవేదన

పార్వతీపురం రూరల్: పార్వతీపురంలోని కలెక్టరేట్ వద్ద వివిధ వర్గాల ప్రజలు తమ సమస్యలపై ఆందోళనలు చేశారు. తమకు జరిగిన అన్యాయాలపై ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులకు వినతులు అందజేశారు.

మంత్రి గారూ.. వినిపిస్తోందా...



గత ఎన్నికల్లో ప్రస్తుత మంత్రి గుమ్మిడి సంధ్యారాణి గెలుపుకోసం ఎంతో కష్టపడ్డాం. నాకు ఏ ఆధారమూ లేదు. వితంతువును. ఆశ కార్యకర్త పోస్టు ఇస్తానని మంత్రి హామీ ఇచ్చారు. ఇప్పుడు నాకు కాదని ఓ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగి భార్యకు అప్పగించారు. మంత్రి సంధ్యారాణిని అడిగితే.. 'ఆ పోస్టు నీకు ఇవ్వలేం. మా బంధువులకు ఇవ్వాలి' అంటూ దాటవేశారు.' అంటూ సాలూరు మండలం తోణాం పంచాయతీకి చెందిన సుజాత అనే మహిళ వాపోయారు. అధికారులను కలిసి వేడుకుంటున్నా ఫలితం ఉండడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పీజీఆర్ఎస్‌లో ఉన్నతాధికారులను మరోమారు వినతిపత్రం అందజేశారు. తనకు న్యాయం చేయాలని వేడుకున్నారు.

పాఠశాల ఏర్పాటు చేస్తారా? ఒడిశాకు పంపిస్తారా?



కొమరాడ మండలం పూడేసు పంచాయతీ గుమడింగి గ్రామంలో పాఠశాల లేక పిల్లలు చదువుకు దూరమవుతున్నారని గ్రామస్తులు వాపోయారు. సుమారు 45 కుటుంబాలు జీవిస్తున్నామని, 20 మంది వరకు బడిఈడు పిల్లలున్నారని తెలిపారు. అధికారులను అడిగితే 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఎండభద్ర పాఠశాలకు వెళ్లాలంటున్నారని.. దానికి బదులు ఒక కిలోమీటరు దూరంలో ఉన్న ఒడిశాలో తమను విలీనం చేస్తే వెళ్లిపోతామని గ్రామానికి చెందిన ఆరిక నాగేశ్వరరావు తదితరులు వాపోయారు. కలెక్టరేట్ పీజీఆర్ఎస్‌లో అధికారులను కలిసి వినతిపత్రం అందజేశారు.

ఆ కంపు భరించలేం..



పార్వతీపురం మండలంలోని డోకిశీల పంచాయతీ చలంవలసలో నివాసాలకు కేవలం 50 మీటర్ల దూరంలో కోళ్ల ఫారాన్ని పెట్టారు. విపరీతమైన దుర్వాసన వస్తోంది... ఆ కంపును భరించలేం.. తక్షణమే కోళ్ల ఫారాన్ని తీసేయాలంటూ చలంవలస గ్రామస్తులు కలెక్టరేట్ వద్ద సోమవారం ఆందోళన చేశారు. అధికారులకు తమ గోడు వినిపించారు.

క్లుప్తంగా

ఏకలవ్య పాఠశాలను సందర్శించిన నోడల్ అధికారి



ఏకలవ్య పాఠశాలలో భోజన నాణ్యత పరిశీలిస్తున్న నోడల్ అధికారి సూర్యనారాయణ

మక్కువ: మండలంలోని అనసభద్ర గ్రామం సమీపంలోని ఏకలవ్య పాఠశాలను నోడల్ అధికారి, డిప్యూటీ ఎంపీడీవో ఎస్.సూర్య నారాయణ సోమవారం సందర్శించారు. పాఠశాలలోని విద్యార్థులు తరగతి గదులను, విద్యార్థులు హాజరు, భోజనమెనూ, పాఠశాల పరిశుభ్రతను పరిశీలించారు. అలాగే మరుగుదొడ్లు అసంతృప్తికరంగా ఉన్నట్లు గుర్తించారు. పాఠశాల చుట్టూ ప్రహరీ నిర్మించాల్సి ఉందన్నారు. ఆర్వో తాగునీరు అవసరమని, పాఠశాల ఆవరణ చదును చేయాల్సి ఉందని, ఇన్వర్టర్లు, జనరేటర్ అవసరమున్నట్లు డిప్యూటీ ఎంపీడీవో సూర్యనారాయణ గుర్తించారు. పై సమస్యలను ఉన్నతాధికారులకు నివేదిస్తానని ఆయన తెలిపారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు పార్వతీపురం యోగా సాధకులు



ప్రశంసాపత్రాలను చూపిస్తున్న యోగా క్రీడాకారులు

పార్వతీపురం రూరల్: జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా స్థాయి యోగా పోటీలు ముగిశాయి. ఈ మేరకు పది నుంచి ఏభై ఏళ్ల వయస్సు గల క్రీడాకారులు ప్రతిభ చూపించారు. ఈ సందర్భంగా వారికి సోమవరం ప్రశంసాపత్రాలు, పతకాలు అందించారు. ఈ సందర్భంగా పోటీల పరిశీలకుడు భాస్కరరావు మాట్లాడుతూ గెలుపొందిన విజేతలకు ఈ నెల 21నుంచి 24 వరకు తాడేపల్లె గూడెంలో రాష్ట్ర స్థాయి పోటీలు జరుగుతాయన్నారు.

గంజాయి నిందితుడి అరెస్టు



పట్టుబడిన నిందితుడితో ఎస్.కోట సీఐ నారాయణమూర్తి

శృంగవరపుకోట: గంజాయి రవాణా చేస్తున్న నిందితుడిని కేరళ రాష్ట్రంలో పట్టుకుని కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్.కోట సీఐ వి.నారాయణమూర్తి చెప్పారు. ఈ మేరకు సోమవారం ఆయన మాట్లాడుతూ గత ఏడాది డిసెంబర్‌లో కేరళ రాష్ట్రానికి చెందిన బొలెరో వాహనంలో ఇద్దరు వ్యక్తులు 117కిలోల గంజాయితో పట్టుబడ్డారన్నారు. ఈ కేసులో కేరళ నుంచి వాహనాన్ని పంపి గంజాయి తెమ్మని చెప్పిన కేరళ రాష్ట్రం, త్రిశూర్ జిల్లా కట్టూర్ పట్టణానికి చెందిన శ్రీజిత్‌ను కేరళ పోలీసుల సహకారంతో పట్టుకుని అరెస్టు చేసి అక్కడి కోర్టులో ప్రవేశపెట్టి, కోర్టు ఆదేశాల మేరకు ఎస్.కోట తీసుకు వచ్చి కోర్టులో ప్రవేశపెట్టినట్లు చెప్పారు. న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు సెంట్రల్ జైలుకు తరలించినట్లు సీఐ తెలిపారు. గంజాయి అక్రమ రవాణా కేసుల్లో కేవలం పట్టుబడిన నిందితులపైనే కాకుండా, ప్రోత్సహిస్తున్న మూలాలను వెదికి పట్టుకుని కేసులు పెడుతున్నామన్నారు.

మృతుడి ఆచూకీ లభ్యం

వేపాడ: మండలంలోని నీలకంఠరాజపురం గ్రామంలో రైవాడ కల్వర్టు వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో మృతి చెందిన వ్యక్తి ఆచూకీ తెలిసినట్లు వల్లంపూడి ఎస్సై సుదర్శన్ తెలిపారు. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శనివారం అర్ధరాత్రి రైవాడ కాలువ కల్వర్టువద్ద గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందిన విషయం విదితమే. ఈ సంఘటనపై పలు పత్రికల్లో వచ్చిన వార్తలతో కుటుంబసభ్యులు గుర్తించి వల్లంపూడి స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. అనకాపల్లి జిల్లా బోడవరం మండలం గజపతినగరానికి చెందిన పీలా శివశంకర్ (41) ప్రమాదంలో మృతిచెందినట్లు చెప్పారు. సమాచారం తెలుసుకున్న శివశంకర్ భార్య పార్వతి స్టేషన్‌కు వచ్చినట్లు తెలిపారు. మృతిచెందిన శివశంకర్ విశాఖలోని మధురవాడలో ఆయుష్ డిపార్ట్‌మెంట్‌లో వాహన డ్రైవర్‌గా పనిచేస్తున్నాడని చెప్పారు. రెండోతేదీన ఎస్.కోట వివేకానంద కాలేజీలో ఇంటర్ చదువుతున్న కుమార్తెను చూడడానికి వెళ్లి తిరిగి వస్తుండగా నీలకంఠరాజపురం రైవాడ కల్వర్టు వద్ద ప్రమాదంలో మృతిచెందినట్లు తెలిపారు. మృతుడు శివశంకర్‌కు భార్య పార్వతి ఇద్దరు పిల్లలు ఉన్నారు. పార్వతి పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు. ఢీ కొన్న గుర్తుతెలియన వాహనంపై బృందాలను ఏర్పాటుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డెస్డ్	స్కిన్‌లెస్
₹105	₹180	₹190

క్రీడాకారులతో ఆటలు..!

- జిల్లా క్రికెట్‌లో చక్రం తిప్పుతున్న సెలక్షన్ కమిటీ సభ్యుడు
- పొరుగు జిల్లాలు, రాష్ట్రాల క్రీడాకారులకు పెద్దపీట
- డమ్మీగా మారిన చైర్మన్, కార్యదర్శులు
- అసోసియేషన్ సభ్యులను ఖాతరు చేయని సెలెక్టర్
- జిల్లా క్రీడాకారులకు న్యాయం చేయాలంటూ మంత్రికి మొరపెట్టుకున్న తల్లిదండ్రులు
- నిమ్మకునీరెత్తినట్లు జిల్లా క్రికెట్ అసోసియేషన్



క్రికెట్ ఆడుతున్న క్రీడాకారులు

విజయనగరం: జిల్లా క్రికెట్‌లో ఉమ్మడి విజయనగరం జిల్లా క్రీడాకారుల ప్రాతినిధ్యం తగ్గిపోతోంది. జిల్లా జట్ల ఎంపికలో సెలక్షన్ కమిటీ సభ్యుడి ఒంటెత్తు పోకడలతో జిల్లా క్రీడాకారులు తీవ్ర అన్యాయానికి గురవుతున్నారన్న విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. దశాబ్ద కాలంగా ఇదే తరహా వ్యవహారం నడుస్తున్నప్పటికీ, ఏడాది క్రితం అధికారంలోకి వచ్చిన ప్రభుత్వ పెద్దలు జిల్లా క్రీడాకారులకు న్యాయం చేస్తామంటూ ప్రకటనలు చేశారు. సంబంధిత శాఖాధికారులతో పాటు, అసోసియేషన్ ప్రతినిధులతో స్థానిక ఎమ్మెల్యే సమీక్ష చేశారు.

అయితే ఏడాది కాలమైనా అదే పరిస్థితి కొనసాగడంపై తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా క్రికెట్‌లో కీలక స్థానంలో ఉన్న కార్యదర్శితో తనకున్న స్నేహాన్ని ఉపయోగించుకుని జట్ల ఎంపికలో తన మాటే చెల్లుబాటయ్యేలా సెలక్షన్ కమిటీ సభ్యుడు వ్యవహారాన్ని నడిపిస్తున్నట్లు తల్లిదండ్రులు, మంత్రి కొండపల్లి శ్రీనివాస్ వద్ద ఏకరువు పెట్టినట్లు సమాచారం. ఇప్పటికైనా దేశానికి ప్రాతినిధ్యం వహించిన విజయనగరం క్రికెటర్ సర్ విజ్జీ నడయాడిన జిల్లాలో స్థానిక క్రీడాకారులకే చోటు కల్పించాలని, ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రులు ఎమ్మెల్యేలు ఎంపీలు కృషి చేయాలని స్థానిక క్రీడాకారులు, క్రీడాభిమానులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

అన్నీ వట్టి మాటలేనా?

కూటమి ప్రభుత్వం ఏర్పాటైన ఆరేడు నెలలకు జిల్లా క్రికెట్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఏర్పాటైంది. చైర్మన్‌గా ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, కార్యదర్శిగా పి.సీతారామరాజు, ఇతర కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. అయితే నూతన కార్యవర్గం ఏర్పడిన సమయంలో సభ్యులు, అసోసియేషన్ పెద్దలు స్థానిక క్రీడాకారులకే ప్రాధాన్యం కల్పిస్తామని చెప్పిన మాటలు వట్టి మాటలు గానే మిగిలిపోయాయన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. 2025లో అన్ని విభాగాల జట్ల ఎంపికలో స్థానికేతర క్రీడాకారులకే తగిన ప్రాధాన్యం దక్కినట్లు తల్లిదండ్రులు ఆరోపణలు గుప్పిస్తున్నారు. ఇటీవల అండర్-16 జట్టుకు ఎంపికైన 18 మంది జిల్లా జట్టు క్రీడాకారుల్లో సుమారు 13 మంది పొరుగు జిల్లాలకు చెందిన క్రీడాకారులే ఉన్నారంటే ఇతర జిల్లాల క్రీడాకారుల హవా ఏ స్థాయిలో ఉందో అర్థమవుతుంది. అలాగే అండర్ -19, అండర్-23, సీనియర్ విభాగంలోనూ వారి ప్రాతినిధ్యం ఎక్కువగా ఉందని తెలుస్తోంది.

గుర్రుగా అసోసియేషన్ సభ్యులు

జిల్లా సెలక్షన్ కమిటీ సభ్యుల తీరుపై అసోసియేషన్ లోని కొంతమంది సభ్యులు గుర్రుగా ఉన్నట్లు తెలుస్తోంది. సెలక్షన్ కమిటీ ఒంటెత్తు పోకడలతో విసుగు చెందిన అసోసియేషన్ సభ్యులు సైతం తల్లిదండ్రులతో పాటు మంత్రి వద్దకు వెళ్లినట్టు విశ్వసనీయ సమాచారం.

విజయనగరం కాదు.. విశాఖ 'బి' జట్టు పేరు సార్థకం

విజయనగరం జిల్లా జట్టులో ఒకప్పుడు క్రికెట్ ఆడే క్రీడాకారులు లేక పొరుగు జిల్లాల నుంచి క్రీడాకారులు వచ్చి జిల్లా తరఫున ఆడేవారు. నాటి నుంచి క్రికెట్ వర్గాల్లో విజయనగరం జిల్లా జట్టును విశాఖ బి జట్టుగా పిలిచేవారు. అయితే జిల్లా క్రీడాకారులకు క్రికెట్‌పై అవగాహన పెరగడంతో ఎక్కువ సంఖ్యలో జిల్లా క్రీడాకారులు ఎక్కువమంది క్రికెట్ ను ప్రాఫెషన్‌గా తీసుకున్నారు. దీంతో ఉమ్మడి విజయనగరం జిల్లాలో అధిక సంఖ్యలో క్రీడాకారులు తయారయ్యారు. అయినా గడిచిన మూడు, నాలుగేళ్లుగా విజయనగరం జిల్లా జట్టులో వలస పక్షుల ప్రాతినిధ్యం భారీ స్థాయిలో పెరిగిపోయింది. ప్రతి ఏటా అండర్-12, అండర్-14, అండర్-16, అండర్-19, అండర్-23, సీనియర్స్ విభాగాల్లో ఎంపికలు జరిగితే ప్రతి విభాగంలో సగానికి పైగా పొరుగు జిల్లా క్రీడాకారులకే ప్రాతినిధ్యం కల్పిస్తున్నారు.

దర్జాగా వస్తారు.. జట్టులో చోటు ఎగరేసుకు పోతారు

పొరుగు జిల్లాల క్రీడాకారులు ఇక్కడ వారి సలహాతోనే జిల్లాలోని వివిధ పాఠశాలలు, కళాశాలలో చేరుతారు. వారందించే స్టడీ సర్టిఫికెట్ ఆధారంగా సదరు సెలెక్టర్ వారిని జట్టుకు ఎంపిక చేస్తారు. అయితే వారు పాఠశాలకు వచ్చింది లేదు..వెళ్లిందీ లేదు. ఎందుకంటే ఇక్కడికి ప్రతిరోజు పాఠశాలకు గాని, కళాశాలకు గానీ వస్తే, జిల్లా కేంద్రంలోని విజ్జి స్టేడియంలో ప్రతిరోజు నిర్వహించే ప్రాక్టీస్ సెషన్‌కు ఎందుకు రారని స్థానిక క్రీడాకారులు, తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. స్థానికేతర క్రీడాకారుల తల్లిదండ్రులు ఆధార్ ఇతరత్రా సర్టిఫికెట్లు పొరుగు జిల్లాలోనే ఉంటాయి. వీరివి మాత్రం అన్ని సర్టిఫికెట్లు ఇక్కడే ఉన్నట్లు సెలక్షన్ సమయంలో అందిస్తుంటారని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.

నిబంధనలు పాటిస్తున్నాం:

జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి జట్టు ఎంపికల్లో నిబంధనల ప్రకారమే నడుచుకుంటున్నాం. మూడేళ్ల పాటు జిల్లా పరిధిలో చదివే వారికి అవకాశం కల్పిస్తున్నాం. క్రీడాకారుడి స్టడీ సర్టిఫికెట్, ఆధార్, జనన ధ్రువీకరణ పత్రాలను పరిశీలిస్తున్నాం. వాటి ప్రకారమే ఎంపికలకు అనుమతిస్తున్నాం. ఎంపిక ప్రక్రియలో ఎటువంటి అవినీతికి తావులేకుండా చూస్తున్నాం.

– పి.సీతారామరాజు, జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి, విజయనగరం.

ఎరువులు అధికార పార్టీ నాయకులకేనా?

- ఆదివాసీ గిరిజన సంఘం ధ్వజం

పార్వతీపురం రూరల్: మండలంలోని సంగంవలస సచివాలయం పరిధిలో ఎరువుల కొరత తీవ్రంగా ఉందని, మొదట్లో వచ్చిన నిల్వలను అధికార పార్టీ నాయకులకు మాత్రమే ఇచ్చారు కానీ సాధారణ రైతులు, గిరిజన రైతులకు ఇవ్వని పరిస్థితి ఉందని ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు ధ్వజమెత్తారు. ఎరువుల నిల్వలు వచ్చిన ఒక్కరోజులోనే ఏ విధంగా సరఫరా పూర్తవుతుందో అర్థం కావడం లేదని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కె. రామస్వామి అన్నారు. తీరా వెళ్లి అడిగితే మళ్లీ నిల్వలు వచ్చేదాకా ఎదురు చూడాలని అధికారులు చెబుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. నిల్వలు వచ్చిన వెంటనే అధికార పార్టీ నేతలకు సమాచారం ఇచ్చి పంపిణీ చేస్తున్నారని గిరిజన సంఘం నాయకులు ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించకపోతే వచ్చే సోమవారం కలెక్టరేట్ వద్ద ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో కద్రక నారప్ప, కద్రక తమ్మన్న, శ్రీరాములు, శంకరరావు, గంగన్న, మోహనరావు , తదితరులు పాల్గొన్నారు.

పరిమళించిన మానవత్వం



గాయపడిన అనాథ మహిళను ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

రాజాం సిటీ: మానవతా సంస్థ సభ్యుల్లో మానవత్వం పరిమళించింది. రోడ్డు పక్కన గాయాలతో బాధపడుతున్న అనాథ మహిళకు వైద్యసేవలు అందించి మానవత్వం చాటుకున్నారు. స్థానిక బొబ్బిలి రోడ్డులోని ఆర్‌సీఎం చర్చి సమీపంలో అనాథ మహిళను గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ఓ మూలన ఉన్న మహిళను స్థానికులు గుర్తించి మానవతా సంస్థ సభ్యులకు సమాచారం అందించారు. వెంటనే సభ్యులు ఉల్లాకుల నీలకంఠేశ్వరయాదవ్, రెడ్‌క్రాస్ ప్రతినిధి పెంకి చైతన్య, కిరణ్‌లు స్పందించి సంఘటనా స్థలానికి చేరుకుని బాధిత అనాథ మహిళను ప్రత్యేక వాహనంలో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి వైద్యసేవలు అందించారు. అయితే ఆమె తీవ్రంగా గాయపడడంతో శస్త్రచికిత్స పడుతుందని, అందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తామని వైద్యులు తెలిపారని మానవతా సంస్థ సభ్యులు తెలిపారు. దీంతో పలువురు పట్టణవాసులు వారి సేవలను కొనియాడారు.

24 గంటల్లో చోరీ కేసు ఛేదన

సాలూరు: మండలంలోని పి.కోనవలస గ్రామానికి చెందిన గూనాపు అప్పలనరసమ్మ అనే వృద్ధురాలు ఆదివారం మండల కేంద్రం సాలూరులో తన సొంత పనులపై వెళ్లి వస్తుండగా ఆమె మెడలోని బంగారు గొలుసును గుర్తు తెలియని వక్తులు అపహరించుకుపోయారు. ఈ మేరకు ఆమె అందించిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో పోలీసులు అనుమానితులు, పాత నేరస్తుల కదలికలపై నిఘా పెట్టారు. విశ్వసనీయ సమాచారంతో పోలీసులు సోమవారం పట్టణంలో వాహన తనిఖీలు చేపట్టారు. అనుమానాస్పదంగా తిరుగాడుతున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారే చోరీకి పాల్పడినట్లు గుర్తించారు.

వరకట్న వేధింపులపై కేసు నమోదు

పార్వతీపురం రూరల్: మండలంలోని బందలుప్పి గ్రామానికి చెందిన ఓ మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనకాపల్లి ప్రాంతానికి చెందిన ఆమె భర్త, అత్తమామలపై వరకట్న వేధింపుల కేసు నమోదు చేసినట్లు పార్వతీపురం రూరల్ ఎస్సై బి.సంతోషి కుమారి తెలిపారు. 2022లో వివాహం జరిగిన అనంతరం అదనపు కట్నం కోసం డిమాండ్ చేస్తూ తనను వేధిస్తూ బందలుప్పి గ్రామంలో కన్నవారింట పిల్లలతో విడిచిపెట్టి భర్త వెళ్లిపోయినట్లు ఫిర్యాదులో బాధిత మహిళ పేర్కొన్నట్లు ఎస్సై తెలిపారు.

మీరిచ్చిన హామీలు గుర్తు చేయడం తప్పా..?



మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్న దొరకు స్వాగతం పలుకుతున్న ప్రజలు

- మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

సాలూరు: టీడీపీ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ప్రజలకు గుర్తుచేయడం తప్పా? మీరిచ్చిన హామీలను గుర్తుచేస్తున్న మాపై తప్పుడు విమర్శలు చేస్తారా? అంటూ మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర మండిపడ్డారు. ఈ మేరకు సాలూరు పట్టణంలోని 2,4,5 వార్డుల్లో వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు మున్సిపల్ వైస్‌చైర్మన్ వంగపండు అప్పలనాయుడు ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన బాబు ష్యూరిటీ -మోసం గ్యారంటీ కార్యక్రమంలో రాజన్నదొర పాల్గొన్నారు. ఈ క్రమంలో వార్డుల్లో తిరిగిన ఆయనకు అడుగడుగునా స్థానిక మహిళలు, ప్రజలు హారతులు పట్టి స్వాగతం పలికారు. ఈ ఏడాది పాలనలో ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలుచేయలేదని వాపోతూ , తమ సమస్యలను ప్రజలు రాజన్నదొర ముందు ఏకరువు పెట్టారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను మీకు ఈ పాంప్లెట్‌ల ద్వారా ఇస్తున్నామని, క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేసినా అవి వస్తాయని ప్రజలకు రాజన్నదొర తెలిపారు.

ఆడబిడ్డ నిధి అమలు చేసేదెప్పుడు?

2024 ఎన్నికల్లో సుమారు 2 కోట్ల 10 లక్షల మంది మహిళా ఓటర్లు ఉన్నారని తెలిసిందని అందులో 60 ఏళ్ల పైబడిన వారు సుమారు 60 వేల మందిని తీసేసినా కనీసం కోటి 50 లక్షల మంది మహిళలకు అడబిడ్డ నిధి ఇవ్వాల్సి ఉంటుందన్నారు. నేడు ఆ హామీని అమలుచేయకుండా ప్రజలను మోసం చేసే పద్ధతి సరైంది కాదన్నారు. టీడీపీ ప్రభుత్వం ఇచ్చిన హామీలను తప్పక అమలుచేయాలని డిమాండ్ చేశారు. ప్రజలకు ఏ అన్యాయం జరిగినా, ఏ కష్టమొచ్చినా, ఓ సోదరుడిగా, మీ ఇంటి పెద్ద కొడుకుగా అండగా నేను ఉంటానని రాజన్నదొర పునరుద్ఘాటించారు. కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని 5 వ వార్డులో అంబేడ్కర్ విగ్రహానికి రాజన్నదొర పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు గిరిరఘు, సింగారపు ఈశ్వరరావు, గులిపల్లినాగ, నిమ్మకాయల సువర్ణమ్మ, తాడ్డి లక్ష్మీ, శంకరరావు, యశోదకృష్ణ, రౌతు చిన్నయ్య, శ్రీను, చిన్నారావు, పిరిడిరామకృష్ణ, మజ్జి అప్పారావు, కాకి పాండురంగారావు, కొల్లి వెంకటరమణ, హరిబాలాజీ తదితరులు పాల్గొన్నారు.

ఆనకట్టవద్ద గోతిలో పడి వ్యక్తి మృతి



లక్ష్మణరెడ్డి మృతదేహం



లక్ష్మణరెడ్డి (ఫైల్)

జామి: మండలంలో జామి ఆనకట్టవద్ద గోతిలో పడి ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటనపై పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆనందపురం మండలం బొడ్డుపాలెం గ్రామానికి చెందిన సాడి లక్ష్మణరెడ్డి(38) తన స్నేహితులతో కలిసి స్నేహితుల దినోత్సవం సందర్భంగా జాగరం గెడ్డనీరు జామి గోస్తనినదిలో కలిసే ప్రాంతం వద్దకు ఆదివారం సాయంత్రం వచ్చి సరదాగా గడిపాడు. ఈ క్రమంలో బహిర్భుమికి వెళ్లి ప్రమాదవశాత్తు కాలు జారి ఆనకట్టవద్ద ఉన్న గోతిలో పడిపోయాడు. స్థానికులు, రెస్క్యూ బృందం గాలించగా సోమవారం ఉదయం లక్ష్మణరెడ్డి మృతదేహం లభ్యమైంది. ఈ ఘటనపై మృతుడి భార్య అరుణ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో జామి ఎస్సై వీర జనార్దన్ కేసు నమోదు చేశారు. మృతుడికి భార్య ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి..

భోగాపురం: మండలంలోని రావాడ గ్రామానికి చెందిన బుగత ఈశ్వరరావు(47) తగరపువలసలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మరణించినట్లు ఎస్సై పాపారావు తెలిపారు. దీనిపై పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రావాడ గ్రామానికి చెందిన ఈశ్వరరావుకు భార్య గోవిందమ్మతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈమధ్య కాలంలో తల్లికి వందనం ద్వారా భార్య బ్యాంకు ఖతాలో డబ్బులు పడ్డాయి. అందులో నుంచి కొంత డబ్బులు ఇవ్వమని భర్త ఈశ్వరరావు భార్యపై ఒత్తిడి తెచ్చాడు. దీంతో వారిద్దరి మధ్య గొడవ జరగడంతో మనస్తాపం చెందిన ఈశ్వరరావు నెల 2వ తేదీన గ్రామానికి సమీపంలో ఉన్న భాష్యం లేఅవుట్‌లోకి వెళ్లి పురుగు మందు తాగాడు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు వెంటనే తగరపువలస ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించాడు. భార్య గోవిందమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై పాపారావు కేసు నమోదు చేశారు.

అర్జీల పరిష్కారానికి శ్రద్ధ తీసుకోవాలి

- కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్



ఫిర్యాదు దారులతో మాట్లాడుతున్న ఎస్పీ ఎస్‌వీ మాధవ్ రెడ్డి



వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్

పార్వతీపురం రూరల్: ప్రతి సోమవారం కలెక్టర్ కార్యాలయంలో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే అర్జీలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి అధికారులు పనిచేయాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ఆదేశించారు. ఈ మేరకు సోమవారం 138 అర్జీలను కలెక్టర్‌తో పాటు పీఓ అశుతోష్ శ్రీవాత్సవ, డీఆర్‌ఓ కె. హేమలత కేఆర్‌సీ ఎస్‌డీసీ పి.ధర్మచంద్రారెడ్డి, డీఆర్‌డీఏ పీడీ ఎం.సుధారాణి స్వీకరించారు. నిర్దేశించిన గడువులోనే పెండింగ్‌లు లేకుండా అర్జీలను పరిష్కరించాలని అధికారుకు ఈ సందర్భంగా కలెక్టర్ స్పష్టం చేశారు. సమావేశంలో జిల్లాలోని పలు శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వేగంగా సమస్యల పరిష్కారం

సమస్యలను వేగంగా పరిష్కరించడమే ప్రధాన ఉద్దేశమని ఎస్పీ ఎస్‌వీ మాధవ్ రెడ్డి అన్నారు. ఈ మేరకు సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లాలో ఉన్న పలు స్టేషన్ల పరిధిలలో నుంచి వచ్చిన ఫిర్యాదు దారుల నుంచి 13 ఫిర్యాదులు స్వీకరించి, అర్జీదారులతో ఎస్పీ ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారి ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం సంబంధిత పోలీసు అధికారులతో స్వయంగా ఫోన్‌లో మాట్లాడి ఫిర్యాదు అంశాలను పరిశీలించి, వాటి పూర్వాపరాలను విచారణ చేసి, ఫిర్యాదు అంశాలు వాస్తవాలైనట్లయితే చట్ట పరిధిలో తక్షణ చర్యలు చేపట్టాలని, తీసుకున్న చర్యలకు సంబంధించిన నివేదికను జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయానికి పంపాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీసీఆర్బీ సీఐ సుధాకర్, ఎస్సై ఫకృద్దీన్ తదితర సిబ్బంది ఉన్నారు.

ఐవీఆర్‌ఎస్ సంతృప్తికరంగా ఉండాలి

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన సమస్యలపై అర్జీదారుల సంతృప్తిస్థాయి పెరగాల్సి ఉందని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ పేర్కొన్నారు. సమస్యల పరిష్కార విషయమై ఐవీఆర్‌ఎస్ ద్వారా ప్రభుత్వం చేసే సర్వేలో శతశాతం సంతృప్తికరంగా ఉన్నట్లు అర్జీదారుల స్పందన ఉండాలని స్పష్టం చేశారు. ఈ మేరకు అధికారులు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. ఈ సర్వేలో శతశాతం సంతృప్తి చెందకపోతే సంబంధిత అధికారులను బాధ్యులుగా చేస్తామని హెచ్చరించారు. ఈ మేరకు కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం పీజీఆర్‌ఎస్, పీ4, పీఎం సూర్యఘర్, ఈపీటీఎస్ తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో సమీక్షించారు. సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోభిక, ఐటీడీఏ పీఓలు అశుతోష్‌శ్రీవాత్సవ, సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, డీఆర్‌ఓ కె. హేమలత, ఎస్‌డీసీలు పి. ధర్మచంద్రారెడ్డి, ఎస్. దిలీప్ చక్రవర్తి, డీఆర్‌డీఏ పీడీ ఎం. సుధారాణి, డీఈఓ బి. రాజ్‌కుమార్, డీఐఈఓ వై. నాగేశ్వరరావు, సమగ్ర శిక్ష ఏపీసీ ఆర్. తేజేశ్వరరావు, ఈపీడీసీఎల్ ఎస్ఈకె మల్లికార్జునరావు, డీఎంఅండ్‌హెచ్ఓ డా. భాస్కరరావు, డీఏ హెచ్ఓ డా. మన్మథరావు, డీబీసీ డబ్ల్యూఓ అప్పన్న, డీఆర్‌డబ్ల్యూఎస్ఈఓ ప్రభాకరరావు, సీడీపీఓ శాంతి భవాని, వివిధ అధికారులు పాల్గొన్నారు.

యాప్‌లకు సపోర్టు చేయని ఫోన్‌లు మాకొద్దు

- ఫోన్‌లను సీడీపీఓ కార్యాలయానికి అప్పగించిన అంగన్‌వాడీలు



ఐసీడీఎస్ కార్యాలయంలో అప్పగిస్తున్న ఫోన్లను చూపిస్తున్న అంగన్‌వాడీలు

సాలూరు: పోషణట్రాకర్, బాల సంజీవని వంటి యాప్‌లకు సపోర్టు చేయని ఫోన్‌లు మాకొద్దవంటూ అంగన్‌వాడీ సిబ్బంది సోమవారం ఆందోళన చేశారు. ఫోన్‌లను సాలూరు పట్టణంలోని సీడీపీఓ కార్యాలయానికి అప్పగించారు.

మా టీచర్ రాలేదు..



ఆరుబయట ఆడుకుంటున్న విద్యార్థులు

చిత్రంలో పాఠశాల గేటు ఎక్కి ప్రమాదకర స్థితిలో ఆడుకుంటున్నది జియ్యమ్మవలస మండలం కొండసిరిపి జీపీఎస్ విద్యార్థులు. పాఠశాల సమయంలో ఆడుకుంటున్నారేమిటని చిన్నారులను ప్రశ్నిస్తే టీచర్ రాలేదంటూ సమాధానమిచ్చారు. సీఆర్‌టీ సోమవారం పాఠశాలకు రాకపోవడంతో చిన్నారులు ఇలా ఉదయం నుంచి సాయంత్రం వరకు పాఠశాలలో ఆడుకుంటూ ఇంటిబాట పట్టారు. వాస్తవంగా సీఆర్‌టీ సెలవు పెడితే ఎంఈఓ మరొక టీచర్‌ను పాఠశాలకు పంపించాలి. ఇక్కడ ఆ నిబంధన అమలు కావడం లేదు. టీచర్ సెలవుపెట్టినప్పుడు తరగతులు సాగడంలేదని, ఎప్పుడు తరగతులు ఉంటాయో లేదో తెలియడంలేదని, చిన్నారుకు బోధన సాగడంలేదని గ్రామస్తులు తెలిపారు.

– జియ్యమ్మవలస రూరల్